




మోర్తాడ్‌లో మైనర్ బ్రిడ్జి వద్ద కుంగిపోయిన రోడ్డు ఇలా..

ప్రమాదకరంగా బీటీ రోడ్డు

● నాసిరకం పనులతో కుంగిన రహదారి

మోర్తాడ్, జనవరి 12: మోర్తాడ్ శివారులోని ఒడ్యాట్ రోడ్డులో మత్తడి పనులు నాసిరకంగా జరగడంతో బీటీ రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. గతంలో కురిసిన భారీ వర్షాలకు ముసలమ్మ చెరువు నుంచి వచ్చే ప్రధాన కాలువకు వరదల వల్ల మత్తడి ఇరువైపులా తెగిపోయి భారీగా గుంత ఏర్పడింది. దీంతో వడ్యాట్‌కు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. గతంలో మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్డు భవనాల శాఖ ద్వారా మైనర్ బ్రిడ్జి, మరమ్మతులకు రూ.కోటి 50లక్షలు మంజూరు చేశారు. అయితే కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడి నట్టుగా నాసిరకం పనుల వల్ల బీటీ రోడ్డు సగం వరకు కుంగిపోయింది. ప్రస్తుతం ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. లారీలు, ఇతర వాహనాలు ప్రయాణిస్తే దిగబడి పోయే ప్రమాదం ఉంది. దీంతో వాహనాలు, బస్సులు ఒకే వైపు నుంచి జాగ్రత్తగా వెళ్తున్నాయి. రోడ్డంతా ఒకేలా ఉందని బావించి వెళ్తే వాహనాలు దిగబడి పోయి మత్తడి వాగులో పడే ప్రమాదముందని, పలువురు రైతులు అంటున్నారు. దీని నిర్మాణ సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే నాసిరకం పనులు జరిగాయని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మోర్తాడ్, ఒడ్యాట్ గ్రామస్థులు కోరుతున్నారు.



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి (ఫైల్)

సంక్రాంతికి రెఢీ





- పండుగ సందర్భంగా పందాలకు కోడి పుంజులు
- గెలుపే లక్ష్యంగా పుంజులకు తర్ఫీదు
- చేతులు మారనున్న లక్షలాది రూపాయలు
- ఇప్పటికే జిల్లాలో రెండు చోట్ల దాడులు
- కట్టడి చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలం

కోటగిరి, జనవరి 12: తెల్లారితే కూత కూసి నిద్ర లేపాల్సిన కోడి కయ్యానికి కాలు దువ్వుతోంది. జూదానికి తెర లేపుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ఇప్పటికే గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాలో కోడి పందాలు నిర్వహించేందుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. సంప్రదాయం మాటున కోడి పందాలు నిర్వహించేందుకు వీలుగా పలు ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేశారు. పండుగకు వారం ముందు నుంచే అక్కడక్కడ కోడి పందాలు నిర్వహిస్తుంటే పోలీసులు దాడులు చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో కోడిపందాలను కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని రుద్రూరు, పొతంగల్ మండలంలో కోడి పందాలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు చేశారు.

రెండు రకాలుగా కోడి పందాలు

కోడి పందాలను రెండు రకాలుగా నిర్వహిస్తారు. కత్తి పందెంలో పాల్గొనే కోడి పుంజుల కాళ్లకు కత్తులు కట్టి బరిలోకి దించుతారు. కత్తి దెబ్బలు కాచుకుని ఏ పుంజు నిలుస్తుందో దానిని విజేతగా ప్రకటిస్తారు. మరో పందెంలో పుంజుల కాళ్లకు కత్తులు కట్టకుండా పోటీకి దించుతారు. గెలుపు తేలే వరకు పుంజులు తలపడతాయి.

పందెం పుంజులు.. రకాలు

పందెం పుంజులు చూడగానే వాటి ఆకృతి చూపరులను ఆకట్టుకునేలా దృఢంగా ఉంటాయి. కోడి పుంజుల శారీరదారుఢ్యం, ఆకారం, రంగు, ఎత్తు, తోక, ఈకలను బట్టి వాటిని వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. దేశవాళీ జాతులైన నెమలి, డేగ వంటి వివిధ రకాల జాతులకు శిక్షణ ఇస్తారు. వీటికి బలవర్థకమైన ఆహారం ఇచ్చేందుకు వేలకు వేలు వెచ్చిస్తారు. 5వేల నుంచి 10వేలకు కోడి పుంజులు కొనుగోలు చేసి నెలల తరబడి శిక్షణ ఇస్తారు. అనంతరం లక్షలాది రూపాయలలో పుంజులను కోడి పందాలకు విక్రయిస్తుంటారు.



రుద్రూరు శివారులో కోడి పందెలు నిర్వహిస్తుండగా పట్టుకున్న పోలీసులు (ఫైల్)

మెనూ మామూలుగా ఉండదు

పందెంలో పాల్గొనే కోడి పుంజులకు మెనూ భారీగా ఉంటుంది. ఉదయానే కోడి గుడ్డు, ధాన్యం పలు రకాల మిశ్రమాన్ని కోడి పుంజులకు ఆహారంగా పెడతారు. బాదం, పిస్తాను కలిపిన మిశ్రమం, మల్టీ విటమిన్, డ్రై ఫ్రూట్స్‌తో తయారయ్యే పదార్థాలను పెడతారు. అంజుర, బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్మిస్, నల్ల ద్రాక్ష, తేనే, నువ్వుల నూనె, సొంఠి, తోక మిరియాలు, మాసాల దినుసులు వంటి వాటిని కలిపి ఒక గోలిలాగా తయారు చేసి తినిపిస్తుంటారు. ఒక్కో పుంజుకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పందెలకు సిద్ధం చేస్తారు. పోరులో ఎదుటి పుంజు దాడిని కత్తి దెబ్బలకు కాచుకుని పోటీ పడడానికి శరీరం దృఢంగా ఉండేలా ఆహారాన్ని ఇస్తారు.

కఠోర శిక్షణ

పందెం పుంజులకు క్రమ పద్ధతిలో కఠోర శిక్షణ ఇస్తారు. కోడి పుంజు త్వరగా అలసిపోకుండా ఉండడానికి ఎక్కువ సేపు పోరాడేలా ఉదయాన్నే కోడి పుంజు నోట్లో నీరు కొట్టి కఫాన్ని బయటకు రప్పిస్తారు. కోడి పుంజుకు నాటు కోడి గుడ్డు తెల్లసోనను తినిపించి సుమారు అరగంట సేపు పరుగులు పెట్టిస్తారు. మరో సారి నోట్లో నీరు కట్టి కఫాన్ని బయటకు తెప్పిస్తారు.ఈ ప్రక్రియ తర్వాత కొంత సేపు విశ్రాంతి ఇచ్చి బలవర్థకమైన ఆహారం పెడతారు.

నామ మాత్రపు కేసులు..

పండుగకు కొద్ది రోజుల ముందు నుంచి పోలీసులు హెచ్చరించడం శరామాములుగానే మారింది. నిర్వాహకులపై కేసులు పెట్టినా మళ్లీ కోడి పందెలు కొనసాగుతున్నాయి. కోడి పందెలు ఆర్థికంగా బలంగా ఉన్న వారికి ఆనందాన్ని ఇస్తే చిన్న చితక కుటుంబాలు చితికిపోతున్నాయి. సంప్రదాయం ముసుగులో గతి తప్పుతున్న పరిస్థితులపై పైపైనే కేసులు తప్ప కఠిన చర్యలు పోలీసులు తీసుకోవడం లేదు.

చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు

ఉమ్మడి జిల్లాలో కోడి పందెలలో ప్రత్యక్షంగా లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. కోడి పుంజులకు పందెల కోసం శిక్షణ ఇచ్చి పందెంలో బరిలో దించి పోటీలపై ఆసక్తి ఉన్న వారికి రహస్యంగా సమాచారం అందిస్తున్నారు. కోడి పందెలను చూసేందుకు వచ్చి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. నిర్వాహకులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే రెండు చోట్ల కోడి పందెలపై అధికారులు దాడులు నిర్వహించారు. రుద్రూరు, పొతంగల్ మండలంలో వారం రోజుల్లో దాడులు జరిపి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. గతంలోనూ జిల్లాలోని వర్ని, బోధన్, కోటగిరి, రుద్రూరు, నిజామాబాద్, నందిపేట్, మాక్లూర్, ఎడపల్లి మండలాల్లోనూ కోడి పందెలు నిర్వహించిన సంఘటనలు ఉన్నాయి. కోడి పందెల నిర్వహణకు గతంలో అధికార పార్టీ నాయకులు ఉన్నతాధికారులను చూసిచూడనట్లుగా వ్యవహరించాలని సూచించడంతో దాడులకు వెనుకడుగు వేశారు. అధికార అండదండలతో సంక్రాంతి కోడి పందెల సంప్రదాయాన్ని కొనసాగించి నిర్వాహకులు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

నిజామాబాద్ అర్బన్, జనవరి 12: జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించాకు ఈ సందర్భంగా వ్యక్తలు వివేకానందుడి సేవలను కొనియాడారు. యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నేటి యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి దాయకుడని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని గాజులపేట్, నాగారంలోగల వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏబీవీపీ నాయకులు వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన యువత ఉంటే దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోవచ్చనే దిశగా ఆయన పనిచేశారన్నారు.



వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

బిల్లు కట్టలేదని శవం ఇవ్వని సిబ్బంది

ఆందోళన చేసిన మృతుడి కుటుంబీకులు

ప్రైవేటు ఆసుపత్రిలో దారుణం



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు



సిద్ధి నయీమ్ (ఫైల్)

నిజామాబాద్ అర్బన్, జనవరి 12: నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం దారుణం చోటుచేసుకుంది. చికిత్స పొందుతూ మృతి చెందిన రోగికి సంబంధించిన బిల్లులు చెల్లించలేదన్న కారణంతో మృతదేహాన్ని ఇవ్వకుండా నిర్వాహకులు వేధించిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని ప్రూడెన్స్ ప్రైవేటు ఆస్పత్రిలో ఈ నెల 5న నవీపేట మండలం పొతంగల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయాలపాలైన సిద్ధి నయీమ్ (32) అనే వ్యక్తిని ఆయన కుటుంబ సభ్యులు చేర్పించారు. తలకు తీవ్రగాయాలు కావడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. గురువారం నుంచి నయీంను కుటుంబ సభ్యులకు చూపించేందుకు వైద్యులు నిరాకరించారు. దీంతో ఆయన బంధువులు నయీంను చూపించాలని ఆందోళన చేయడంతో.. నయీం మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. రూ. 2లక్షల బిల్లు కట్టాలని, లేదంటే మృతదేహాన్ని ఇచ్చేది లేదని ఆస్పత్రి నిర్వాహకులు తేల్చి చెప్పారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. డబ్బుల కోసం శవాన్ని సైతం వైద్యులు వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దిగొచ్చిన ఆస్పత్రి యాజమాన్యం.. రోగి బంధువులతో చర్చలు జరిపింది. ఆ తర్వాత నయీం మృతదేహాన్ని వారి కుటుంబీకులకు ఆస్పత్రి సిబ్బంది అప్పగించారు.

జోరుగా పిండి వంటలు



- రెడీమేడ్‌గా సకినాలు, గారెలు, అరిసెలు
- పిండి వంటలతో ఉపాధి పొందుతున్న మహిళలు
- సంక్రాంతి వేళ భలే గిరాకీ



సుభాష్‌నగర్, జనవరి 12: ఒకప్పుడు సంక్రాంతి పండగ వచ్చిందంటే ఊళ్లలో వారం ముందునుంచే పిండివంటల హడావుడి మొదలయ్యేది. ఊరంతా పిండివంటల వాసనతో గుబాలించేది. పండగ వంటలు చేయడంలో ఊళ్లోవారంతా బిజీగా ఉండేవారు. అయితే గత కొన్నేళ్లుగా పిండివంటలు స్వగృహాల్లో కాకుండా స్వగృహ ఫుడ్స్ పిండివంటకాల తయారీ కేంద్రాల్లో తయారవుతున్నాయి. రెడీమేడ్ దుస్తులు, రెడీమేడ్ నగల్లాగే పిండివంటలు కూడా రెడీమేడ్‌గా కొనుక్కొని సంక్రాంతి పండగ జరుపుకుంటున్నారు ఇప్పటి నవతరం. మూడు సకినాలు, ఆరు అరిసెలుగా సాగుతున్న ఈ స్వగృహ ట్రెండ్ సిటీలకే పరిమితమైనప్పటికి ప్రస్తుతం మెల్లిమెల్లిగా గ్రామాలను సైతం తాకింది.

పిండి వంటలకు గిరాకీ.

పండగ సీజన్ వచ్చిందంటే చాలు చేతినిండా ఆడర్స్‌తో క్షణం తీరికలేకుండా కస్టమర్లతో స్వగృహ ఫుడ్స్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి పెద్ద పెద్ద పట్టణాల్లోనే కాదు జిల్లాలోని మండలాల్లో సైతం పిండివంటల తయారీ షాపులు బిజీగా ఉంటున్నాయి. అరిసెలు, సకినాలు, బొబ్బట్లు, జంతికలు, బూరెలు, కజ్జికాయలు, నువ్వుల లడ్డులు వంటి సంక్రాంతి స్పెషల్ ఐటమ్స్‌తో ఒక్కో షాపులో రోజుకు వంద కిలోలపైన అమ్ముతున్నారంటే వీటికి ఉన్న గిరాకీని ఊహించుకోవచ్చు. సంక్రాంతి వచ్చిందంటే అరి సెలు, సకినాలు, జంతికలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ప్రధానంగా పండగ రోజుల్లో రోజుకు సుమారు పెద్దషాపుల్లో కిలో అరిసెలు రూ.200, కిలోకు పైగా సకినాలు, జంతికలు రూ.100కు అమ్ముతున్నారు.

మహిళలకు ఉపాధి

రెడీమేడ్ పిండివంటల తయారీవల్ల చాలామంది ఉపాధి పొందుతున్నారు. పట్టణాల్లో మహిళలకు ఉపాధి తక్కువగా ఉంటుంది. రెడీమేడ్ పిండివంటలతో వీరికి ఉపాధి దొరికింది. మహిళలు పిండివంటలు చేయడంలో నిష్ణాతులు కావడంతో వీరికి ఉపాధి దొరుకుతుంది. ఒక్కొక్క స్వగృహ ఫుడ్స్‌లో సుమారు 20నుంచి 30మంది వరకు మహిళలకు ఉపాధి దొరుకుతుంది. రోజుకు 300నుంచి 400రూపాయ ల వరకు వీరు సంపాదిస్తున్నారు. పండగ సమయంలో ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతుంది. అంతే కాకుండా రెగ్యులర్‌గా స్వగృహ ఫుడ్స్‌తో ఉపాధి కలుగుతుంది.

ఉపాధి దొరుకుతుంది..

: లావణ్య, కార్మికురాలు

పట్టణాల్లో మహిళలకు ఉపాధి దొరకడం కష్టంగా ఉంటుంది. పనులు లేక చాలా రోజులు ఇంటి వద్దే ఉన్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. గత కొన్నేళ్లుగా స్వగృహ ఫుడ్స్‌లో పని లభిస్తుండటంతో ఒకే దగ్గర ఉండి పని చేయడం ఇబ్బంది లేకుండా ఉంది. కుటుంబ పోషణ కూడా తేలికైంది.

పండగ సమయాల్లో అమ్మకాలు ఎక్కువ..

: సృజనరావు, హోమ్ ఫుడ్స్ యజమాని

పండగ సమయాల్లో పిండి వంటల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. దసరా, సంక్రాంతి సమయాల్లో అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. పిండివంటల తయారీతో చాలామంది మహిళలకు ఉపాధి దొరుకుతుంది. ముఖ్యంగా అరిసెలు, జంతికలు, సకినాలు, నువ్వుల లడ్డులకు గిరాకి ఎక్కువగా ఉంటుంది.





పిండి వంటలు తయారు చేస్తున్న మహిళలు

టీయూ బాలికల హాస్టల్

సమస్యలు అధికారులకు పట్టవా?

- గత కొన్నేళ్లుగా మొరపెట్టుకున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఇరుకు హాస్టల్‌లోనే బిక్కుబిక్కుమంటూ వెల్లదీస్తున్న బాలికలు
- నూతన హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న బాలికలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



డిచ్‌పల్లి, జనవరి 12 : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటింది. అన్ని విభాగాల్లో మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాలు చెబుతున్న తెలంగాణ యూనివర్సిటీలో మాత్రం మహిళల విద్యార్థినులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్నచూపు ఉన్నట్లే కనబడుతుంది. ఎందుకంటే గత 10ఏళ్లుగా బాలికల హాస్టల్ ఇరుకుగా మారి బాలికలకు నూతనంగా మరో హాస్టల్ నిర్మించాలని డిమాండు చేస్తున్నారు. అటు వర్సిటీ ఉన్నతాధికారులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదు. మహిళలు అందరూ అక్షరాస్యత ముందజలో ఉండాలనేది ప్రకటనలకే మాత్రం పరిమితమవుతుంది. చదువుకుందామంటే కనీసం వసతి కల్పించాలేని పరిస్థితి తెలంగాణ యూనివర్సిటీలో నెలకొంది. యూనివర్సిటీ ప్రారంభం అనంతరం నిర్మించిన బాలికల హాస్టల్ అప్పటి కోర్సుల స్థాయిని బట్టి 250 మంది విద్యార్థినుల కెపాసిటీ కోసం నిర్మించారు. కానీ యూనివర్సిటీ ప్రతి ఏటా అడ్మిషన్స్‌లో బాలికలే అధికంగా సీట్లు సాధించడం వల్ల ఈ యూనివర్సిటీ హాస్టల్ వారికి సరిపోవడం లేదు. 250మంది కోసం నిర్మించిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 480మంది ఉంటున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. బాలికలకు నూతన హాస్టల్ నిర్మించాని గత పదేళ్లుగా విద్యార్థినిలు, విద్యార్థి సంఘాలు ఎన్నో సార్లు ధర్నాలు చేశారు. కానీ ఎటువంటి స్పందన రాలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కనీసం ఒక్క ప్రజాప్రతినిధి కూడా తెలంగాణ యూనివర్సిటీని సందర్శించకపోవడం, విశ్వవిద్యాలయం పట్ల ప్రభుత్వం చిన్న చూపు కనబర్చడం, వీసీ వర్సెస్ పాలక మండలి మధ్య వివాదలతో ప్రభుత్వం ఈ వర్సిటీని పట్టించుకోలేదు. కనీసం అభివృద్ధి చేయలేదు. దీంతో నిధుల లేమితో వర్సిటీ పాలన పూర్తిగా కుంటుపడింది. ఏదో ఒక డిగ్రీ కళాశాల లాగా తూతు మంత్రంగా వర్సిటీని నడిపిస్తున్నారు. బాలికల హాస్టల్‌లో ఒక్కో గదిలో 20మంది ఉంటు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మూత్రశాలలు, స్నానాల గదులు సరిపోక ప్రతిరోజు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. హాస్టల్ పక్కనే గుట్ట అటవీ ప్రాంతం ఉండటంతో విషప్రాణులు హాస్టల్‌లోకి తరుచు వస్తున్నాయి. హాస్టల్ కనీస మౌలిక సదూపాయలు లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. తెలంగాణ యూనివర్సిటీని గతంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని వెంటనే యూనివర్సిటీ హాస్టల్ సమస్యలతో పాటు వర్సిటీని అభివృద్ధి చేస్తుందని విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. వారి అవస్థలను ప్రభుత్వం పట్టించుకుని తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేసి ఇన్‌చార్జ్ వీసీని తొలగించి పూర్తిస్థాయి వైస్ చాన్సలర్ నియ మించాలని వర్సిటీ రాష్ట్ర బడ్జెట్‌లో అధికనిధులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పిప్రి సొసైటీలో వ్యవసాయ రుణాల పంపిణీ

ఆర్మూర్ రూరల్, జనవరి 12: ఆర్మూర్ మండలం పిప్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ఇటీవల 17మంది సభ్యులకు రుణమాఫీ కాగా మాఫీ అయిన రైతులకు నూతన వ్యవసాయ రుణాలను సొసైటీ చైర్మన్ హేమంత్‌రెడ్డి అందజేశారు. రూ.14లక్షల 85 వేలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో హన్మండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆలూర్‌లో..

ఆలూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన సొసైటీ క్యాలెండర్‌ను పీఏసీఎస్ చైర్మన్ తంబురి శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు కల్లెం బోజారెడ్డి, బార్ల సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, గోవర్ధన్, ప్రమోద్‌కుమార్, ఆరే రాజేశ్వర్, నర్సారెడ్డి, సీఈవో తొర్తి మల్లేష్ ఉన్నారు.

పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

భీమ్‌గల్ రూరల్, జనవరి 12 : వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అధికారికంగా మొదటిసారి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి గ్రామస్థులు, మహిళలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జీపీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జైడి నాగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ డొల్ల రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున, జడ్పీటీసీ అల్లకొండ భారతి రాకేష్‌చంద్ర, సీడీపీవో సుధారాణి, నీరజ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటిని సీజ్ చేసిన బ్యాంకు అధికారులు

లోన్ డబ్బులు చెల్లించలేదని ఇల్లు సీజ్

భిక్కనూరు, జనవరి12: ఇంటి నిర్మాణానికి తీసుకున్న డబ్బులు చెల్లించడం లేదని, పలు నోటీసులు పంపించిన స్పందించకపోవడంతో బ్యాంకు అధికారులు ఇంటిని సీజ్ చేసిన ఘటన శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. భిక్కనూరు కెనరా బ్యాంకు రీజినల్ అధికారి చంద్రభూషణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేష్మ కొంతకాలం క్రితం భిక్కనూరు కెనరా బ్యాంకులో రూ.12లక్షల హౌసింగ్ లోన్ తీసుకుంది. తీసుకున్న లోన్ సరిగా కట్టకపోవడంతో బ్యాంకు నిబంధనల ప్రకారం తీసుకున్న రూ.12లక్షలకు రూ.లక్షా50వేల వడ్డీ అయ్యింది. డబ్బులు కట్టాలని రేష్మకు నోటీసులు పంపినా స్పందించకపోవడంతో బ్యాంకు నిబంధనల ప్రకారం తహసీల్దార్ శివప్రసాద్, ఏఎస్సై జగదీష్ సమక్షంలో ఇంటిని ఖాళీ చేయించి సీజ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది భార్గవ్, సుధీర్, ఈశ్వర్, బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుబాయ్‌లో బోనాల్ వాసి మృతి

లింగంపేట, జనవరి12: లింగంపేట మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన గరిగె ప్రభాకర్ (32) దుబాయ్‌లో రెండురోజుల క్రితం మృతి చెందినట్లు శుక్రవారం గ్రామస్థులు తెలిపారు. దుబాయ్‌లోని పవర్ రిక్రూట్‌మెంట్ ఎల్ఎల్‌సీ కంపెనీలో పనిచేయడానికి 2023 మే నెలలో ఇంటి నుంచి వెళ్లినట్లు తండ్రి పర్వయ్య తెలిపారు. మే 11న తాను దుబాయ్ చేరుకున్నానని ఫోన్ చేసినట్లు ఆయన తెలిపాడు. అనంతరం కుటుంబ సభ్యులతో కాంటాక్టులో లేడని శుక్రవారం మృతి చెందినట్లు సమాచారం వచ్చినట్లు మృతుడి భార్య రాధ తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి పంపేందుకు దుబాయ్‌లోని గల్ఫ్ బాధితుల సంఘం అధ్యక్షుడు గుండెల్లి నర్సింలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారని చెప్పారు. శవం కోసం కుటుంబీకులు ఎదురు చూస్తున్నారు.

సైకిల్‌ను ఢీకొన్న బైక్: ఇద్దరి మృతి

భిక్కనూరు, జనవరి12: రోడ్డు దాటుతున్న సైకిల్‌ను బైకు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకటి (46) గ్రామంలో 44వ జాతీయరహదారి పక్కన దాబాలో పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. కామారెడ్డి నుంచి భిక్కనూరువైపు తన బైక్‌పై వస్తున్న దోమకొండ గ్రామానికి చెందిన నిఖిల్, సుమంత్ అతివేగంగా వచ్చి సైకిల్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటి అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన నిఖిల్ (24)ను కామారెడ్డికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన సుమంత్ కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడు వెంకటికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు రాకేష్, గణేష్ ఉన్నారు.

యువజన దినోత్సవం

ఆర్మూర్ టౌన్, జనవరి 12: పట్టణంలోని లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాకు చెందిన టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారుడు స్పోర్ట్స్ కోటలో జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యోగం సంపాదించిన వికాస్‌ను లయన్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం. వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద చిత్రపటానికి లయన్స్‌క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివేకానంద చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ వైస్‌గవర్నర్ అమర్‌నాథ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌దాస్, కోశాధికారి రఫీయోద్దిన్, సామల లక్ష్మీనారాయణ, జీవీ.నర్సింహరెడ్డి, డికె.రాజేష్, అంబల్ల శ్రీనివాస్, ఎం.రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

కమ్మర్‌పల్లి, జనవరి12: భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో హెచ్‌ఎం పసుపుల సాయన్న, ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారం, పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్, వివేకానంద యూత్ సభ్యులు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రాజశేఖర్, ప్రభాకర్, సల్లూరి కిషన్‌గౌడ్, నల్ల గణేష్ గుప్త, మామిడి నరేష్, నవాతె రంజీత్ సున్నం మోహన్, కూన గంగాధర్ యూత్‌సభ్యులు పాల్గొన్నారు. అలాగే చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లోనూ స్వామి వివేకానంద జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

● నేటి యువత వివేకానందుని అడుగు జాడల్లో నడవాలి

ధర్పల్లి: నేటి యువత వివేకానందుని అడుగు జాడల్లో నడవాలని ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి యువతకు సూచించారు. శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా యువజనోత్సవ కార్యక్రమాన్ని స్థానిక మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాణక్య టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ సైదా, ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది ప్రణీత్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్ రూరల్, జనవరి 12: మండలంలోని చేపూర్‌లోని క్షత్రీయ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహస్వామి తెలిపారు. పాఠశాల విద్యార్థులు నమ్రత, ప్రితిక, హరిణి, శ్రీనిధి, లితిక్ష, శృతిక, హరిణి ఎంపికయ్యారు. ఈనెల 15నుంచి అసిఫాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినీలను ప్రిన్సిపాల్, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

సరస్వతి శిశుమందిర్‌లో సంక్రాంతి సంబరాలు

ముప్కాల్, జనవరి 12: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు వేషాధారణలో ఆటలు, పాటలు అలరించాయి. మహిళలు పెద్దఎత్తున రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దయానంద్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు దినేష్, కమిటీ సభ్యుడు ఒడ్డెన్న, చంద్రమోహన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణలో విద్యార్థులు

కొత్త మండలంలో..

అందని వివిధ శాఖల సేవలు!

● డొంకేశ్వర్‌లో ఒక్క తహసీల్ కార్యాలయమే.. ● ఏ సమస్య వచ్చినా ఉమ్మడి మండలానికే పరుగులు ● అన్ని శాఖల సేవలందించాలంటున్న ప్రజలు

డొంకేశ్వర్, జనవరి12: ప్రజల పరిపాలనా సౌలభ్యం పేరుతో కొత్త మండలాలను ఏర్పాటుచేసిన గత ప్రభుత్వం ఒక్క తహసీల్ కార్యాలయం మినహా ఏ కార్యాలయాన్నీ ఏర్పాటు చేయకుండానే వదిలేసింది. దీంతో పేరుకే కొత్త మండలమని, ప్రతీ పనికి ఉమ్మడి మండలానికే పరుగులు పెట్టాల్సి వస్తోందని మండలాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నందిపేట్ మండలంలో ఉన్న డొంకేశ్వర్‌ను కొత్త మండలం గా ఏర్పాటు చేసింది. డొంకేశ్వర్ మండలం ఏర్పాటై దాదాపు ఏడాది గడిచినా ఒక్క తహసీల్దార్ కార్యాలయం మినహా ఇప్పటివరకు ఏ కార్యాలయమూ ఏర్పాటు కాలేదు. దీంతో మండల ప్రజలు కొత్త మండలంలో వివిధరకాల ప్రభుత్వసేవలను అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ పనికి ఉమ్మడి మండలానికి పరుగులు పెడుతున్నారు.



డొంకేశ్వర్‌లో తహసీల్దార్ కార్యాలయం

● అందుబాటులోకి రాని శాఖల సేవలు

మండలస్థాయి ప్రతీ మండలంలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ, ఉపాధిహామీ, వ్యవసాయ, ఐసీడీఎస్, ఇరిగేషన్, వివిధ శాఖలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మిగతా శాఖల కోసం మండల కేంద్రంలో భవనాలు అందుబాటులో ఉంచారు. అందుబాటులో లేని శాఖల సేవల కోసం ఉమ్మడి నందిపేట మండలానికి వెళ్తున్నారు. నూతన మండలం ఏర్పడితే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని భావించిన ప్రజలకు మళ్లీ అవే సమస్యలు ఎదురవుతున్నాయి.

● వ్యవసాయ శాఖ కార్యాలయం లేక ప్రజల అవస్థలు

ఉమ్మడి నందిపేట మండలానికి బయలు దేరాల్సి వస్తోంది. నూతన మండలం ఏర్పడిన ఇక్కడ మిగతా శాఖల సేవలు అందకపోవడంతో మండల ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా రైతులు వ్యవసాయం మీద ఆధారపడి ఉంటారు. ఎక్కువగా వరి, సోయా, పసుపు పంటలు సాగుచేస్తారు. రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు వ్యవసాయ కార్యాలయం లేక అవస్థలు పడుతున్నారు. ఏదైనా అనుకొని ఘటనలు జరిగినపుడు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించేటప్పుడు పోలీసులకు నందిపేట్ నుంచి డొంకేశ్వర్ మండలానికి రావాలంటే ఎక్కువ సమయం పడుతుండడంతో అత్యవసర సేవలను ఆలస్యం అవుతున్నాయి. వ్యవసాయ, ఉపాదిహామీ సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు కూలీలు నందిపేట్ మండలానికి బయలుదేరాల్సి పరిస్థితి ఉంది. కొత్త మండలం ఏర్పాటైతే సేవలు అందుబాటులోకి వస్తాయి అనుకున్న ప్రజలకు సేవలు అందక మళ్లీ పాత మండలానికి వెళ్లాల్సి వస్తోంది. కొత్త మండలంలో ఎప్పుడు మిగతా కార్యాలయాల సేవలు అందుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మిగతా కార్యాలయాలు ఏర్పాటుచేసే శాఖల సేవలు త్వరగా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాలు లేక ఇబ్బందిగా ఉంది



● పోతుగంటి సురేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు, డొంకేశ్వర్

మండలం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్నా ఇంకా అన్ని ఆఫీసులు సేవలు లేక ఇబ్బంది పడుతున్నాం. కొత్త మండలంలో ఒక్క రెవెన్యూ సేవలు అందుతున్నాయి మిగతాశాఖల సేవలు కోసం నందిపేట మండలానికి పోవాల్సి వస్తోంది. పైఅధికారులు స్పందించి తొందరగా అన్ని ఆఫీసులు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలు అందుతాయి.

గత ప్రభుత్వంలో మంజూరైన పనులను ఆపొద్దు

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

ముప్కాల్, జనవరి 12: తమ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను రద్దు చేయకుండా అలాగే కొనసాగించాలని, పనులు నిలిపివేయడం సరైంది కాదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలానికి తొలిసారి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి బాల్కొండ మండల శ్రీరాంపూర్ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో ఘనస్వాగతం పలికారు. నాగాపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించి గ్రామపంచాయతీ భవనాన్ని అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలో గత పదేళ్లలో 114 గ్రామ పంచాయతీలకు 70 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో బీఆర్ఎస్ లెటర్ ప్యాడ్‌మీద మంజూరు చేసినవి కావని, ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అప్రూవల్‌తో వివిధ శాఖలు ప్రిన్సిపాల్, సెక్రెటరీ పనులు నిజామాబాద్, సిరిసిల్ల కలెక్టర్లు తెలంగాణ ప్రభుత్వతరఫున బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన వివిధ శాఖలకు సంబంధించి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎస్‌డీఎఫ్ పనులు, కులసంఘ భవనాలు, ఆలయాలు, మసీదులు, చర్చీలు, రోడ్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలు గ్రామీణ ఆసుపత్రులు పనులను మంజూరు చేస్తున్నపనులను ఆపకుండా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డిని ప్రజల తరఫున ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, జడ్పీటీసీసభ్యుడు దాసరి లావణ్య వెంకటేష్, సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్‌రెడ్డి, వన్నెల్ (బి) ఉపసర్పంచ్ నాగులపల్లి కిషన్, కిసాన్‌నగర్ సర్పంచ్ మానేటి తులసీ నాగభూషణం, జలాల్‌పూర్ సర్పంచ్ గడ్పంద కల్పన అనిల్, ఉపసర్పంచ్ లింబారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నాగాపూర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఏర్గట్ల: గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను ఆపొద్దని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగేంద్రనగర్‌లో రూ.20లక్షలతో నిర్మించిన జీపీ భవనం, తడపాకల్‌లో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో వివిధ శాఖల ద్వారా రోడ్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు, సంఘ భవనాలు, ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరీ తీసుకొచ్చిన పనులు కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కోరుతున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేంధర్‌రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, భారస మండలాధ్యక్షుడు రాజాపూర్ణానందం, సర్పంచ్‌లు పత్తిరెడ్డి ప్రకాష్ రెడ్డి, మోత్కూరి మంజుల బాలాజీ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అశ్రఫ్, క్యాతం దేవేంధర్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది

● కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

ఇందల్వాయి, జనవరి12: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామశివారులో రైల్వేట్రాక్ పక్కన ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి భార్యతో అక్రమ సంబంధమే హత్యకు దారి తీసిందని విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలంలోని వెంగల్‌పాడ్ తండాకు చెందిన నరేష్ గత నెల 30 నుంచి కన్పించడం లేదని మృతుడి తల్లి నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు విచారణలో ఉండగా.. జనవని 8న తిర్మన్‌పల్లి శివారులోని ఎల్లమ్మ ఆలయం వెనకాల రైల్వేట్రాక్ సమీపంలో నరేష్ మృతదేహం లభ్యమైంది. డిచ్‌పల్లి సీఐ కృష్ణ ఘటనాస్థలానికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారించగా కొత్త కొరుట్ల తండాకు చెందిన కేతావత్ రాజేష్, మృతుడు నరేష్ డిసెంబర్ 30న తిర్మన్‌పల్లి గ్రామంలోని కల్లుబట్టి వద్ద కల్లుతాగి వెళ్లారని తెలిసింది. రాజేష్ గురించి వెతుకుతుండగా అతను అప్పటినుంచి కనిపించకుండా పోయాడని ఈనెల 11న రాజేష్‌ను పట్టుకొని విచారించగా మృతుడు నరేష్‌కు, నింధితుడు రాజేష్ భార్యతో అక్రమ సంబంధం ఉండటంతో రాజేష్ నరేష్‌ను కల్లుబట్టి వద్దకు తీసుకువెళ్లి కల్లుతాగించి తనను చంపుతానని బెదిరించడంతో అక్కడి నుండి పారిపోయినట్లు తెలిపారు. పారిపోతున్న నరేష్‌ను వెంబడించి రైల్వేట్రాక్ వద్ద పట్టుకొని గొంతుపై కాలువేసి పెద్దబండరాయితో తలపై బాదడంతో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడని నింధితుడు రాజేష్ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. భార్యతో ఉన్న వివాహేతర సంబంధం వల్లే నరేష్‌ను చంపానని, తన భార్య తనకు దూరమవుతుందన్న ఆవేదనతో నేరం చేశానని తెలిపినట్లు సీఐ వెల్లడించారు. నింధితుడి వద్ద నుంచి సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన బండరాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసును ఛేదించామని, ఇందులో డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఇందల్వాయి ఎస్సై మహేష్, సిబ్బంది రాజేశ్వర్, ప్రసాద్, సర్దార్, సతీష్, కిశోర్, రాము ఉన్నారు.

● నింధితుడి రిమాండ్

డిచ్‌పల్లి: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని వెంగల్‌పాడ్ గ్రామానికి చెందిన నరేశ్‌ను హత్యచేసిన రాజేశ్‌ను శుక్రవారం రిమాండ్ చేసినట్లు డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్‌లు తెలిపారు. నేరం ఒప్పుకోవడంతో నింధితుడిని కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ముప్కాల్, జనవరి12: బాల్కొండ జాతీయరహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని కల సంతోష్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గంగనది ఒడ్డునఉన్న ఆలయంలో సంతోష్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో తండ్రి గంగారాం అనారోగ్యంతో ఉన్నాడని తెలిసి చూసి తిరిగి కాలినడకన వెళ్తుండగా జాతీయ రహదారిని దాటే సమయంలో వేగంగా వచ్చిన ఢీకొట్టగా కల సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్సై శంకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



మృతులు సమీర్, అనాస్ (ఫైల్)

ఎడపల్లి/ఖిల్లా, జనవరి12: మండలంలోని జానకంపేట గ్రామశివారు లోగల అశోక్‌సాగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకు లు మృతిచెందారు. మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో నిజామాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన సమీర్, అనాస్, కరీం అనే యువకులు బైకుపై నెహ్రూనగర్ నుంచి బోధన్ వైపు వెళ్తుండగా బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఎర్టీగా కారు బైకుని ఢీకొట్టడంతో అక్కడికక్కడే సమీర్ (28), అనాస్ (30) మృతిచెందగా.. కరీం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంను నిజామాబాద్ ఏరియాస్పత్రికి తరలించారు. నిజామాబాద్ 6వ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

● ఉత్సాహంగా పాల్గొన్న యువత

కమ్మర్‌పల్లి, జనవరి12: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం వివేకానందయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అనూహ్య స్పందన లభించింది. గ్రామానికి చెందిన యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామానికి చెందిన 45మంది యువకులు రక్తాన్ని దానంచేశారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బంది దాతలరక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాలెపు చిన్నగంగారాం, కార్యదర్శి శాంతి కుమార్, వివేకానంద యూత్ సభ్యులు రాజశేఖర్, యాదగిరి, ప్రభాకర్, పసుపుల వినీత్, నల్ల గణేష్ గుప్త, రామస్వామి, సున్నం మోహన్, సల్లూరి కిషన్ గౌడ్, నవాతె రంజీత్ ,చింత ప్రదీప్, చంద్రమోహన్, దాత్రిక రాజ్ కుమార్, గ్రామ యువకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రక్తదాతలను మెమోంటోలను ఉప సర్పంచ్ గంగారాం, కార్యదర్శి శాంతికుమార్ అందజేశారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

డిచ్‌పల్లి, జనవరి12: మండలంలోని ధర్మారం(బి)లో శ్రీదేవిభూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తి పాటలు పాడుతూ కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు.

కేరళ లాటరీ పేరిట మోసం

● బీర్కూర్ పీఎస్‌లో బాధితుడు ఫిర్యాదు




బీర్కూర్, జనవరి 12: నిరుపేదలనే లక్ష్యంగా చేసుకుని కొందరు స్వార్థపరులు లాటరీల పేరుతో అమాయక ప్రజలకు మోసం చేస్తున్నారు. సోషల్‌మీడియా ప్లాట్ ఫామ్‌లలో కోట్లు గెలుచుకోవచ్చనే లాటరీల అడ్వర్టజ్‌మెంట్‌లను చూసి ప్రజలు ఆకర్షితులై నిండా మునుగుతున్నారు. అచ్చం ఇలాంటి సంఘటనే బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన మక్క గంగారాం అనే వ్యవసాయ కూలి సుమారు రూ.11వేల వరకు పొగొట్టుకున్నాడు. తన స్మార్ట్ ఫోన్‌లో ఫేస్‌బుక్‌లో కేరళ లాటరీ అడ్వర్టైజ్‌మెంట్ చూశాడు. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేశాడు. వెంటనే అవతలి వ్యక్తి తన మాయమాటలతో గంగారాం అకౌంట్‌లోని డబ్బులను కాజేశాడు. కిష్టాపూర్‌కు చెందిన మెక్క గంగారాం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఈనెల 10వ తేదీన గంగారాం తన వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో ఫేస్‌బుక్ ఓపెన్ చేశాడు. కేరళ లాటరీ పోస్టును చూసి అందులో గల ఫోన్ నెంబర్‌కు కాల్ చేశాడు. మోసగాడు మాయమాటలు చెప్పి గంగారాంకు నమ్మకం కలిగించగా మోసగాడి సూచన మేరకు రూ.149 గూగుల్‌పే పంపించాడు. తర్వాత అవతలి వ్యక్తి కొన్నిలాటరీ నెంబర్లను పంపగా గంగారాం అందులో నుంచి ఒక నెంబర్‌ను సెలెక్ట్ చేసి పంపించాడు. అనంతరం మోసగాడు గంగారంకు ఫోన్‌చేసి 7లక్షల లాటరీ తలిగిందని చెప్పాడు. మాయమాటలకు గంగారాం ఉప్పొంగి అవతలి వ్యక్తి మాయమాటలకు మధ్యాహ్నం రూ.3,100, సాయంత్రం రూ.7,200 పంపించాడు. రాత్రి ఫోన్ చేసి జీఎస్టీ, ఇన్‌కామ్‌టాక్స్, కరెంట్‌అకౌంట్ కోసం మరో రూ.12,500 పంపమన్నాడు. దీం తో గంగారాంకు అనుమానం వచ్చి డబ్బులు పంపలేదు. తనను ఎవరో మోసం చేశారని గ్రహించి శుక్రవారం బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆన్‌లైన్‌లో మోసాలు, స్కీంలు, లాటరీలు తదితర మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు గంగారాంకు అవగాహన కల్పించి ఇంటికి పంపించారు.

సహకార నిబంధనలను ఉల్లంఘించిన పాలకవర్గం?

● పొతంగల్ విండో కార్యదర్శితో సహా పాలకవర్గాన్ని రద్దు చేయాలని ఏకగ్రీవ తీర్మానం ● సంఘం లావాదేవీలపై విచారణ జరపాలని సభ్యుల డిమాండ్

కోటగిరి, జనవరి 12: సహకార సంఘం నిబంధనల మేరకు నడుచుకోవాల్సిన పాలకవర్గం వివిధకారణాలతో జనరల్ బాడీ సమావేశాన్ని సకాలంలో నిర్వహించకపోవడంపై సభ్యుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. సహకార సంఘం కార్యదర్శి పాలకవర్గం సంఘం నిర్వహణలో పట్టు కోల్పోయారంటూ సభ్యులు ఆరోపించారు. ఇలాంటి పాలకవర్గం ఒక్క క్షణం పదవిలో ఉండరాదంటూ కార్యదర్శితో పాలకవర్గాన్ని రద్దు చేయాలని తీర్మానం చేయడం విశేషం. పొతంగల్ మండలం కేంద్రంలో విశాల సహకార పరపతి సంఘం 86వ మహాజన సభ డీసీసీబీ డైరెక్టర్, విండో అధ్యక్షుడు శాంతేశ్వర్‌పటేల్ అధ్యక్షతన శుక్రవారంఏర్పాటుచేశారు. మహాజన సభలో సంఘం వార్షిక లావాదేవీలను విండో కార్యదర్శి భారత్ వివరిస్తుండగా సభ్యులు అడ్డుకున్నారు. గత ఏడాది సెప్టెంబరు 30వ తేదీన నిర్వహించాల్సిన మహాజన సభ ఎందుకు నిర్వహించలేదని సభ్యులు ప్రశ్నించారు. ఏడాది క్రితం సంఘంలో జరిగిన లావాదేవీలపై సమగ్ర వివరాలు వెల్లడించని పాలకవర్గం సకాలంలో మహాసభ సైతం నిర్వహించకుండా జాప్యం చేయడం సభ్యుల ఆగ్రహానికి కారణమైంది. ఈ విషయమై పాలకవర్గం, విండో కార్యదర్శిని ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విండో కార్యదర్శి, అధ్యక్షుడు సంఘం లావాదేవీలపై సమగ్ర వివరాలు సభ్యులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. విండో అధ్యక్షులు శాంతేశ్వర్ పటేల్ మాట్లాడుతూ తాను అనారోగ్య సమస్యలతో బాధపడి సమావేశ నిర్వహణలో జాప్యం జరిగిందని వివరించారు. విండో కార్యదర్శి సహకరించకపోవడంతో ఈ విషయమై డీసీవో దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినవారు పట్టించుకోకపోవడంపై సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పలు వ్యాపార లావాదేవీల్లోనూ అక్రమాలు జరిగినట్లు సభ్యులు ఆరోపించారు. విండో కార్యదర్శి నిర్లక్ష్యం వల్లే ఇన్‌కమ్ టాక్స్ సేల్ టాక్స్ సుమారు 3కోట్ల రూపాయల వరకు జరిమాన కట్టాల్సి వచ్చిందన్నారు. నిజామాబాద్‌లో రైస్‌షాప్ నిర్వహించే విషయంలో సమగ్ర వివరాలు ఎందుకు లేవని సభ్యులు షాదుల రమేష్ ప్రశ్నించారు. 2019లో 10నెలల నివేదిక పరిశీలించగా 52లక్షల బియ్యం సేల్స్ చేసి 43లక్షలు మాత్రమే ఖాతాలో జమ చేశారన్నారు. మిగతా 9లక్షలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. రైస్‌మిల్లు తౌడు విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని సభ్యులు ఆరోపించారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన సహకార సంఘంలో రైతులకు ఎరువులు అందించలేని పరిస్థితితలెత్తిందన్నారు. తాము ఇతర ప్రాంతాలకు వెళ్లి ఫర్టిలైజర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. మరోవైపు విండో ఉపాధ్యక్షుడు పవన్ రాజీనామా చేసి 4నెలలు గడుస్తున్నా ఆమోదించినట్లా, ఆమోదించనట్లా పాలకవర్గానికే తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని నియమిస్తే సంఘం పాలన పూర్తిగా గాడి తప్పి నష్టాల ఊబిలోకి జారుకుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ సంఘానికి నష్టం చేస్తే సహించేది లేదని సభ్యులు పేర్కొన్నారు. సహకార సంఘ నిబంధనల మేరకు జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించకపోతే రద్దు చేసే అధికారం మహాసభ సభకు ఉందని సభ్యులు పేర్కొన్నారు. తక్షణమే పాలకవర్గాన్ని రద్దు చేస్తూ విండో కార్యదర్శిని తొలగించాలని మెజారిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సంఘంలో గత నాలుగేళ్లలో జరిగిన లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో విండో కార్యదర్శి భరత్, మాజీ జడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ పవన్, మాజీ సర్పంచ్ దిలీప్ కుమార్, విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమస్యలపై విండో అధ్యక్షుడిని ప్రశ్నిస్తున్న సభ్యులు



వీడీసీ సభ్యులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ ఏసీపీ

చట్టాన్ని చేతిలోకి తీసుకొని నేరస్థులుగా మారొద్దు

● ఇన్‌చార్జి ఏసీపీ కిరణ్‌కుమార్

ఆర్మూర్ టౌన్, జనవరి 12: చట్టాన్ని చేతిలోకి తీసుకొని నేరస్థులేగా మారొద్దని ఇన్‌చార్జి ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో దేగాం వీడీసీ సభ్యులతో మాట్లాడుతూ ఇటీవల దేగాం గ్రామంలోని పలువురు రైతుల పొలాల్లో ఓ వ్యక్తి దొంగతనానికి పాల్పడగా అతడిని పట్టుకున్నవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పకుండా తమ వద్దే నిర్బంధించడం సరికాదన్నారు. గ్రామాలలో చోరీలకు పాల్పడిన ఇతర ఏ నేరాలు చేసిన వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించాలన్నారు. నేరాలకు పాల్పడిన వారిని ఇతర నేరస్థులను శిక్షించే అధికారం న్యాయవ్యవస్థకు ఉందన్నారు. గ్రామాలలో ఉన్న వీడీసీలు గ్రామాభివృద్ధికి తోడ్పాడాలని, పంచాయతీలు నిర్వహించి శిక్షలు వేయవద్దని సూచించారు. పలు చట్టాలపై గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు, రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు అంజమ్మ, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

● టీడీపీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు యాదాగౌడ్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బోధన్‌రూరల్, జనవరి12: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించడంతోపాటు అర్హులైన వారందరికీ అభయహస్తం పథకాలు అందించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు యాదాగౌడ్ అన్నారు. శుక్రవారం బోధన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా బలపడటంతోపాటు పార్టీ తరపున రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. రాబోయే రోజుల్లో టీడీపీ పటిష్ఠత కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సీహెచ్‌వీ హనుమంతరావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు సచిన్ పటేల్, భాస్కర్, సాయిబాబా నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

కమ్మర్‌పల్లి, జనవరి12: యువకులుసమయాన్ని వృధాచేయకుండా క్రీడల్లో చురుగ్గా పాల్గొంటూ జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని బషీరాబాద్ సర్పంచ్ సక్కరం అశోక్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని క్రీడామైదానంలో బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అద్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీటీసీ తోట జ్యోతితో కలిసి ప్రారంభించారు. టోర్నమెంట్‌కు హాజరైన జట్లతో పరిచయ కార్యక్రమం అనంతరం టాస్‌వేసి తొలుత బ్యాటింగ్ చేసి సర్పంచ్‌అశోక్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈటోర్నమెంట్‌లో జిల్లా లోని వివిధ మండలాలకు చెందిన 24 క్రికెట్ క్రీడాజట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ జట్ల మధ్య ఆట కొనసాగగా కమ్మర్‌పల్లి జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గౌరవ సభ్యులు సంజీవ్‌గౌడ్, రంజీత్, బి.నగేష్, ఎస్.శ్రీనివాస్, దేవేందర్, రాజేష్, సక్కరం నారాయణ, నేల్ల రమేస్, వినోద్, అరవింద్, చైతన్య, పండు క్రీడాభిమానులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

చైనా మాంజ అమ్మితే కేసు

డొంకేశ్వర్, జనవరి 12: పక్షులకు హాని చేసే చైనా మాంజ అమ్మితే షాపుల యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనుషులతోపాటు పక్షులు, జంతువులకు హానీ కలిగించే మాంజల తయారీ, విక్రయాలను నిషేధించాలని నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అమ్మినట్టు తెలిస్తే సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.







నగరంలో.. నినాదాలు చేస్తున్న ఏబీవీపీ నాయకులు | ఆర్మూర్‌లో.. | బోధన్‌లో జయంతి వేడుకలో నాయకులు

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ● జిల్లావ్యాప్తంగా ఆయా సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు

నిజామాబాద్ అర్బన్, జనవరి12: నేటి యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి దాయకుడని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని గాజుల్‌పేట్, నాగారంలోగల వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రపంచం మొత్తం అయనను ఎంతగానో గౌరవిస్తారన్నారు. కార్యక్రమంలో మమత ప్రభాకర్, పోతన్‌కర్ లక్ష్మినారాయణ, మల్లేష్‌యాదవ్, పంచరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

● నివాళులర్పించిన ఏబీవీపీ నాయకులు

నగరంలోని ప్రగతి హాస్పిటల్ వద్ద వివేకానంద చిత్రపటానికి ఏబీవీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రెంజర్ల నరేష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన యువత ఉంటే దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోవచ్చనే దిశగా ఆయన పనిచేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటకృష్ణ, సునీల్, జగదీశ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● మోపాల్‌లో..

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీశ్, ఈశ్వర్‌సింగ్ నాయక్, వీడీసీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, జైభారత్ యూత్ అధ్యక్షుడు సాయిరాం, నాయకులు పాల్గొన్నారు.

● యువత వివేకానంద అడుగుల్లో నడవాలి

బోధన్‌రూరల్: యువత స్వామివివేకానంద అడుగు జాడల్లో నడవాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసులోటి గోపికిషన్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హిందూ వాహిణి ఆధ్వర్యంలో పలువురు స్వామివివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలోని రాకాసిపేట్‌లో శ్రీసాయి ఆదర్శయువతి మండలి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను నిర్వహించారు. సాలూర మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్నిగ్రామాల్లో యువకులు స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఉత్సహంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందూవాహిని నాయకులు అంకు మహేష్, సూర్యకుమార్, పులి సాయిలు, ఎ.గౌతమ్‌గౌడ్, రవి కిరణ్, పద్మాసింగ్, మదన్‌సింగ్, నవ్య లక్ష్మీ రణవీర్‌సింగ్‌లతో పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా 19మంది రక్తదానశిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దూపల్లి సర్పంచ్ సాయిరెడ్డి సొసైటీ చైర్మన్ భూంరెడ్డి, లింగం యాదవ్, రాములు, నర్సన్న పాల్గొన్నారు.

నవీపేట: మండలంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ఎదురుగాఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివేకానంద యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రాకేష్, వెంకట్, గౌతం, ప్రభాకర్, బీజేవైఎం నాయకులు శ్రీకాంత్, భాను గౌడ్, బబ్లు గౌడ్, తదితరులున్నారు. పోతంగల్‌లో శివాజీ సేవయూత్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఖుషి పండిత్, రాజేందర్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

● మోస్రాలో..

మోస్రా: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహాన్ని విగ్రహ దాత మాజీ లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ సుజాత సూర్యరాజ్ ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ 320 డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ బాన్సువాడ కోకన్వీనర్ భూపాల్ రెడ్డి, జడ్పీటీసీ విజయ భాస్కర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మాణిక్యం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్‌లో స్వామివివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్లెం మోహన్, ఎంపీటీసీ లక్ష్మీమల్లేష్, ఉపసర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, లక్ష్మణ్, డాక్టర్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెర్కిట్: బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌరస్తా వద్ద స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుప్పాల శివరాజ్, జీవీ.నర్సింహరెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, ద్యాగ ఉదయ్, జెస్సు అనిల్, ఆకుల రాజు, పులి యుగంధర్, ఉదయ్‌గౌడ్, రాజ్‌కుమార్, కిరణ్, పెద్దోళ్ళ భరత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

● జక్రాన్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి, అర్గుల్ గ్రామంలో స్వామివివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బ్రహ్మణ్‌పల్లి సర్పంచ్ లత దేవరాజ్, ఎంపీటీసీ రాజు, ఉపసర్పంచ్ సుప్రియ, మాజీసర్పంచ్ శేఖర్, ఫర్వెక్ట్ యూత్ సభ్యులు సాయిరాం, నవీన్, సతీష్, నారాయణ, రఘు, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం స్వామివివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు మారంపల్లి గంగాధర్, సాగర్, స్వామి పాల్గొన్నారు.

● ఎడపల్లిలో..

ఎడపల్లి: మండలకేంద్రంతోపాటు ఆయాగ్రామాల్లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా కార్యదర్శిరఘు, మల్లెపూల శ్రీనివాస్, సాయి, అరుణ్, నవీన్, శ్రీకాంత్, రత్నాకర్, నవీన్, బట్టు రాజు తదితరులు ఉన్నారు.

వర్ని: మండలకేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రవీణ్, ఏబీవీపీ నాయకులు ఈశ్వర్, జ్ఞానేశ్వర్, చరణ్, సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



మోస్రాలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



పెర్కిట్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో..



ఎడపల్లిలో.. విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పేకాట స్థావరంపై దాడి

● ఐదుగురి పట్టివేత

బోధన్‌రూరల్, జనవరి 12: బోధన్ మండలంలోని సంగం గ్రామంలో పేకాటస్థావరంపై బోధన్ పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. శుక్రవారం పకడ్బందీ సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులతో పాటు రూ.9,290 స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా పేకాట నిర్వహించినా, ఆడినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలోని శివారు ప్రాంతాలలో ఎవరైనా పేకాట నిర్వహిస్తే గ్రామస్థులు తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు. జీవితాలను నాశనం చేసే పేకాట ఎవరూ ఆడకుండా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

నవీపేట, జనవరి12: ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని నిజామాబాద్ డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాలలో కొనసాగుతున్న ప్రజా పాలనకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. శుక్రవారం రాత్రిలోగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పలు గ్రామాల్లో గ్రామసభలు

నవీపేట, జనవరి 12: మండలంలోని శివతండా, మట్టయ్య ఫారం తండాలలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రకు చెందిన గ్రామసభలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఆర్ఐ మోహన్, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, ఏపీఎం భూమేష్‌గౌడ్, శివ తండా సర్పంచ్ రమేష్, మట్టయ్య ఫారం తండా ఉపసర్పంచ్ పుల్‌సింగ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, జనవరి12: ఈనెల నుంచి 14వరకు సిద్దిపేట జిల్లా సాంఘిక పాఠశాల కొండపాక క్రీడా మైదానంలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలలో ప్రణీత, స్వప్న, మేఘన, పాల్గొంటున్నారని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. శుక్రవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నీరజరెడ్డి, పీఈటీ జ్యోత్స్నఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

మోస్రా, జనవరి 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం జడ్పీటీసీ భాస్కర్ తనిఖీ చేశారు. ఆసుపత్రికి మంజూరైన రూ.10 లక్షల నిధులు ఏంచేశారని డాక్టర్ వినయ్‌ని అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాలని సూచించారు. మండల కార్యాలయం నిర్మాణం వద్ద ఓ వ్యక్తికి పాటు కాటు వేయగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రాగా పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయన వెంట మాజీరైతుబంధు కోకన్వీనర్ రాములు ఉన్నారు.

ఎల్లారెడ్డిపల్లిలో రక్తదాన శిబిరం

ఇందల్వాయి, జనవరి12: స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో గ్రామానికి చెందిన 30మంది యువకులు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ బాబురావు, శ్రావణ్, లక్ష్మణ్, రఘు, తదితరులున్నారు.

ఆర్మూర్‌లో ముగ్గుల పోటీలు

ఆర్మూర్ టౌన్, జనవరి 12: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. క్షత్రీయ సమాజ్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేయగా ఆకర్షణగా నిలిచిన ముగ్గులకు ప్రథమ బహుమతి కములు కీర్తన, ద్వితీయ సాత్‌పూతే అర్చన, తృతీయ కటారి కవితకు బహుమతులను కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత, ప్రాంతీయ యువజన సమాజ్ లీగల్ అడ్వైజర్ జెస్సు అనిల్ అందజేశారు. ఈ సందర్భంగా సంక్రాతింపండుగ విశేషతను వివరించారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు ఖాందేశ్ సుదర్శన్, ప్రధానకార్యదర్శి అల్జాపూర్ నందకిశోర్, డమాంకర్ సునంద, గుజరాతి ప్రకాష్, దోండి రవీందర్, రామ్‌దాస్, కిషన్, ప్రభాకర్, మోహన్, సురేష్, కములు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీలు

నిజామాబాద్‌అర్బన్, జనవరి12: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్‌లో శుక్రవారం మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందినవారికి అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాశ్ హాజరై బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాయిప్రసన్న, రెండో బహుమతి వినోద, మూడో బహుమతి వినీతలు అందుకున్నారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మహిళా ఉద్యోగులకు పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, సతీష్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు ముగ్గుల పోటీలు..

రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల కోటగల్లిలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కాంత్‌రావు, చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో ..

సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం హమాల్‌వాడిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పోటీలలో పాల్గొనగా గెలుపొందిన వారికి రవిపబ్లిక్ స్కూల్ డైరెక్టర్ సరళ మహేందర్‌రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్



హంగర్గలో మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి, జనవరి 12: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. పోతంగల్ మండలంలోని హంగర్గ, కారేగాం గ్రామాలలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సాబ్ కాసాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బీమా, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో మారుతి, బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్ శెట్టి, ఏపీవో గంగారాం, ఏఈవో సుప్రియ, సర్పంచ్‌లు జ్యోతి, సునీత, నాయకులు తదితరులున్నారు.

విప్లవ పార్టీల ఐక్యత మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

మోర్తాడ్, జనవరి12: ప్రజాఉద్యమాలను బలోపేతం చేయడానికి రెండు కమ్యూనిస్టు విప్లవ పార్టీల ఐక్యత కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రజాపంథ కార్యాలయంలో 3,4,5తేదీలల్లో జరిగే జాతీయస్థాయి మూడు విప్లవపార్టీల ఐక్యత మహాసభల వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాపంథ జిల్లా నాయకుడు ఎస్.సురేష్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల కమిటీల కార్యదర్శులు జి.కిషన్, అశోక్, డివిజన్ నాయకులు సత్తెక్క, నారాయణ, బాలయ్య, రాధ, లక్ష్మక్క, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్ (కిలో)	రూ.135	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ. 63,700	రూ. 58,700	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గుంటూరు కారం (9.20, 12.40, 4.00, 7.20, 10.40)
స్క్రీన్-2 : సైంధవ్ (10.20, 1.20, 4.20, 7.20, 10.20)
స్క్రీన్-3 : గుంటూరు కారం (8.40, 12.00), మేరి క్రిస్మస్ (తెలుగు) (3.20, 10.00), సలార్ (6.25)
స్క్రీన్-4 : హనుమాన్ (9.00, 12.20 3.40, 7.00, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గుంటూరు కారం (10.25, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : హనుమాన్ (10.20, 1.20, 7.20, 10.35)
స్క్రీన్-3 : సైంధవ్ (10.30, 1.35, 4.30, 7.30, 10.30)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్: గుంటూరు కారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : గుంటూరు కారం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్